
శాలిగౌరారం : రామగిరిలో హరితోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ బండారు శంకరయ్య, అధికారులు


కేతేపల్లి : ఇనుపాముల లోమొక్కను నాటుతున్న జడ్పీటీసీ బొప్పని స్వర్ణలత, అధికారులు


చిట్యాల: నర్సరీలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ చిన వెంకట్‌రెడ్డి

# సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే ఆకుపచ్చ తెలంగాణ

- జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- నియోజకవర్గ వ్యాప్తంగా హరితోత్సవం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నార్కట్‌పల్లి జూన్ 19 : ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో చేపట్టిన హరితహారంతోనే ఆకుపచ్చ తెలంగాణ సాధించారని జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు.రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక పట్టణ కేంద్రంలో శబరి గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి హరితోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా రాశి రిఫ్రాక్టరీ కంపెనీ పక్కనున్న వెంచర్లలో మొక్కలు నాటి ర్యాలీగా తిరిగి వచ్చారు. అనంతరం జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి సారథ్యంలో గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి ఆకు పచ్చ గ్రామాలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే హరిత హారం రాష్ట్రంలో విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి రాంబాబు ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, చిట్యాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షులు యానాల అశోక్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండల వ్యాప్తంగా సర్పంచులు, అధికారులు, ప్రజలు ర్యాలీ నిర్వహించి మొక్కలను నాటి నీళ్లు పోశారు.

చిట్యాల : చిట్యాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా నిర్వహించారు. రైతువేదిక సమీపంలోని నర్సరీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, కమీషనర్ మందడి రాందుర్గారెడ్డి, కౌన్సిలర్లు కోనేటి కృష్ణ, జిట్ట పద్మ, బెల్లి సత్తయ్య, రుద్రవరం పద్మ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, నాయకులు పొన్నం లక్ష్మయ్య, జిట్ట చంద్రకాంత్, గంట శ్రీనివాస్‌రెడ్డి, శీల సత్యనారాయణ, రంగ వెంకన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.


గుండ్రాంపల్లిలో సీఎం కేసీఆర్ నాటిన మొక్కకు నీళ్లు పోస్తున్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ,ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## సీఎం కేసీఆర్ స్ఫూర్తితోనే మొక్కల పెంపకం

- చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ,ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, జూన్ 19 : సీఎం కేసీఆర్ స్ఫూర్తితోనే హరితహారంలో మొక్కలు నాటుతున్నట్లు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో సీఎం కేసీఆర్ నాటిన మొక్కకు వారు పూజలు చేసి పక్కకు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కాళిందిని, ఎంపీపీ కొలను సునీతావెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆది మల్లయ్య, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, సర్పంచ్ రత్నం పుష్పానర్సింహ, ఎంపీడీఓ లాజర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకార సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

రామన్నపేట, జూన్ 19 : మండలకేంద్రంలో స్వర్ణకారుల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని స్వర్ణ కారులు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు సోమవారం నార్కట్‌పల్లిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూ. 10లక్షల నిధులను మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు స్వర్ణకారుల సంఘం మండలాధ్యక్షుడు కన్నె కంటి వెంకటేశ్వరచారి తెలిపారు. అనంతరం స్వర్ణకారులుఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలోవిశ్వ బ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు మారోజు అనంతచారి, నాయకులు చొల్లేటి చంద్రశేఖరచారి, ఆకవరపు శ్రీనివాసచారి, శ్రీరామోజు నర్సింహాచారి, మారోజు రాఘవచారి, నాగభూషణచారి, సుచిత్ర, పాండు రంగా చారి, ప్రభాకరచారి, అంజయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

శాలిగౌరారం, జూన్ 19 : మండలంలోని వల్లాల గ్రామంలోని మోడల్‌స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎన్‌సీసీ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని పాఠశాల ఎన్‌సీసీ అధికారి శీలం భద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సుంకి సాహితి, జాల శ్రేష్ఠ, ప్రణిత, షేక్ అబ్దుల్ హకీంలు ఎంపికైనట్లు తెలిపారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ప్రిన్సిపల్ రాగిణి అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

చిట్యాల, జూన్ 19 : మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని జాతీ య రహదారిపై ఆది వారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నల్లగొండ వైపు రోడ్డు రోలర్‌తో వెళ్తున్న ట్రాలీ లారీ మరమ్మతుల కారణంగా డ్రైవర్ రోడ్డు పక్కన ఆపాడు. అదే క్రమంలో వెళ్తున్న డీసీఎం అతివేగంగా వెళ్తూ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జార్ఖండ్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ వినయ్‌కుమార్ ఆలియాస్ బి.సింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. దాంతో నార్కట్‌పల్లి కామినేని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# చక్కబడిన చదువులు

- స్వరాష్ట్రంలో బడులు బలోపేతం
- విద్యపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం
- సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం బోధన
- మన ఊరు-మన బడితో మారిన పాఠశాలల రూపురేఖలు
- గురుకులాల ఏర్పాటు.. ఒక్కో విద్యార్థిపై రూ.లక్షన్నర ఖర్చు
- దశాబ్ది వేడుకల్లో భాగంగా విద్యా దినోత్సవం

యాదాద్రి భువనగిరి, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : స్వరాష్ట్రంలో విద్యారంగం ప్రగతిబాటలో ముందుకు సాగుతున్నది. తొమ్మిదేండ్లలో ఊహించని విధంగా విద్యాభివృద్ధిలో పురోగతి సాధించింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యారంగాన్ని తలదన్నేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. సీఎం కేసీఆర్ దూరదృష్టితో పేదలకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓ వైపు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ.. మరోవైపు సంక్షేమ శాఖల వారీగా కొత్తగా గురుకులాలను నెలకొల్పి సత్ఫలితాలు సాధిస్తున్నది.

జిల్లాలో మొత్తం 921 పాఠశాలల్లో 1,09,387 మంది విద్యార్థులు 1 నుండి 12వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 744 ప్రభుత్వ పాఠశాలలు, 158 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. 19 పాఠశాలలు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. నిరుపేద పిల్లలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం తీసుకొచ్చింది. బాలకార్మికులుగా మారడాన్ని తగ్గించేందుకు బడిలోనే ఒక పూట భోజనం పెట్టడంతో విద్యా బుద్ధులు నేర్చేకునే అవకాశం ఏర్పడింది. మధ్యాహ్న భోజనంలో కిచిడీ, గుడ్డు, సాంబార్, ఆకుకూరలు, పప్పు, వెజ్ బిర్యానీ తదిత వంటకాలను రోజువారీగా అందిస్తున్నారు. జిల్లాలోని 712 ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 55,012 మంది పిల్లలు మధ్యాహ్న భోజన పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

**మన ఊరు-మన బడితో కార్పొరేట్ స్థాయిలో..**

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కార్పొరేట్ స్థాయిలో స్కూళ్లన్నీ సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నాయి. గ్రామాల్లో పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. సకల సదుపాయాలతో విద్యార్థులకు విద్యానిలయాలుగా విలసిల్లుతున్నాయి. సీఎం కేసీఆర్ తీసుకొచ్చి మన ఊరు-మన బడి ప్రణాళిక గొప్పగా అమలవుతున్నది. మొదటి విడుతలో భాగంగా జిల్లాలో 251 స్కూళ్లను బాగు చేయాలని ఎంపిక చేశారు. వీటిలో 83 హైస్కూళ్లు, 148 ప్రాథమిక, 20 మాధ్యమిక ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో రూ. 30లక్షల లోపు నిధులు అవసరం ఉన్నవి 225 బడులు ఉండగా.. ఇప్పటికే అన్నింటికీ పనులు ప్రారంభమయ్యాయి. ఇక రూ. 30లక్షల కంటే ఎక్కువ నిధులు కావల్సినవి 26స్కూళ్లు ఉన్నాయి. ప్రస్తుతం 12స్కూళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగతావి పురోగతిలో ఉన్నాయి.

**గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై రూ. లక్షన్నర ఖర్చు..**

రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పెద్ద ఎత్తున గురుకులాలను ఏర్పాటు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను నెలకొల్పింది. కార్పొరేట్ స్థాయిలో విద్యతోపాటు, రెసిడెన్షియల్, దుస్తులు, పుస్తకాలు, యూనిఫాం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నది. ఒక్కో విద్యార్థిపై ఏటా రూ లక్షన్నర ఖర్చు చేస్తున్నది. దాంతో గురుకులాల్లో సీట్ల కోసం పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. వందల సంఖ్యలో సీట్లు లక్షల్లో విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాస్తున్నారంటే గురుకులాల పనితనం అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఐదు బీసీ గురుకులాలు, 8 ఎస్సీ, మూడు మైనార్టీ, ఒక ఆశ్రమ పాఠశాల ఉంది.

**ఇంగ్లిష్ మీడియం బోధన..**

గ్రామీణ, పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ స్కూళ్ల వైపు విద్యార్థుల దృష్టి మళ్లించేలా చర్యలు చేపట్టింది. మేరకు ప్రభుత్వ జిల్లా పరిషత్, సంక్షేమ గురుకులాలు, మోడల్ స్కూళ్లలో డిజిటల్ విద్యాబోధన అమలు చేస్తున్నది. మంగళవారం 82స్కూళ్లలో కొత్తగా డిజిటల్ క్లాసులను ప్రారంభించనున్నారు.

**ఫోర్టిఫైడ్ రాగి జావ (మాల్ట్)**

విద్యార్థులకు ఉదయం రాగి జావ కూడా అందించాలనే ప్రభుత్వ నిర్ణయించింది. జిల్లాలోని 712 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకుంటున్న 55,012 మంది విద్యార్థులకు ఉదయం రాగి జావను అల్పాహారంగా ఇవ్వనున్నారు. దీని కోసం విద్యార్థులకు సుమారు రూ.0.76 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందులో 50శాతం శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వారు, మిగిలిన 50శాతాన్ని ప్రభుత్వం భరిస్తున్నది.

**ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలు**

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు చదువడం అలవాటుగా చేయడానికి వీలుగా గ్రంథాలయాలను బలోపేతం చేయడం ద్వారా పుస్తక ప్రపంచం రీడింగ్ కార్నర్లు) ను ఏర్పరుస్తున్నారు. వీటి వల్ల విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందడంతో పాటు అవగాహన పరిధి విస్తృతమవుతుంది. ఇందుకోసం మొదటి దశలో 152 ప్రాథమిక పాఠశాలల్లో, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గ్రంథాలయ పుస్తకాలను పంపిణీ చేశారు. దశల వారీగా అన్ని పాఠశాలలకు పంపిణీ చేయడానికి ప్రణాళికచేశారు.

**బాలికా సాధికారతకు కేజీబీవీలు..**

బాలికా విద్యను వృద్ధిపరచడంపై పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక దృష్టిని సారించింది. సాధారణ పాఠశాలల్లో బాలికావిద్యను ప్రోత్సహించడంతో పాటు బాలికల కోసం ప్రత్యేక గురుకులాలు, కేజీబీవీలను రెసిడెన్షియల్ పాఠశాలల తరహాలో నిర్వహిస్తున్నారు. జిల్లాలో 11 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో 2263 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు.

**డిజిటల్, వైజ్ఞానిక వనరులు..**

నైపుణ్యాలను సాధించేలా, పిల్లల భాగస్వామ్యాన్ని పెంచేలా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డిజిటల్ యుగంలో, జీవన నైపుణ్యాలతో తన జీవనాన్ని కొనసాగించేలా ఎదగడానికి విద్యార్థులను విద్యాశాఖ తీర్చిద్దుతున్నది. ఇందుకనుగుణంగా పాఠశాలల్లో డిజిటల్ వనరులను సమకూరుస్తున్నది. ఇందులో భాగంగా 488 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ట్యాబ్‌లను పంపిణీ చేసింది. 17 మండల రిసోర్సు కేంద్రాలు, 157 ఉన్నత పాఠశాలల్లో ఐసీటీ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

**వర్క్‌బుక్కులు, నోటుబుక్కులు..**

ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఉచిత నోటుబుక్స్‌లు కూడా అందించాలనే ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో పేద పిల్లల చదువుల్లో వెలుగులు నిండనున్నాయి.

ప్రాథమిక స్థాయి విద్యార్థులకు 1 నుంచి 5వ వరకు వారి సామర్థ్యాలను వృద్ధి పరచడానికి వీలుగా తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులలో వర్క్ బుక్స్ ను ఇవ్వడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

**భవిత కేంద్రాలు..**

దివ్యాంగులైన పిల్లల గురించి కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వారంతా విద్యా స్రవంతిలో కొనసాగేలా, అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టింది. 17 మండల కేంద్రాల్లో భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు.

**తొలిమెట్టు కార్యక్రమం..**

విద్యాప్రమాణాల పెంపు, గుణాత్మకమైన మార్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది,. విద్యార్థులు కనీస సామర్థ్యాలను సాధించే ఉద్దేశంతో దీన్ని రూపొందించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తుండగా, వేల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు.

**నేడు విద్యా దినోత్సవం..**

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా విద్యా దినోత్సవం నిర్వహించనున్నారు. అన్ని రకాల విద్యాసంస్థల్లో జాతీయ పతాకాలను ఎగురవేయనున్నారు. అనంతరం సభలో తెలంగాణ సాధించిన విద్యాప్రగతిని వివరించనున్నారు. మన ఊరు మన బడి పాఠశాలలను ప్రారంభించనున్నారు. సిద్ధంగా ఉన్న గ్రంథాలయాలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లకు శ్రీకారం చుట్టనున్నారు.